దుర్వాస శాస్త్రి ఇంట్లో అడుగు పెట్టేసరికి మంచంలో ముసలమ్మ మూలుగుతోంది. అతను కాళ్ళ యినా కడుక్కోకుండా ఆమె దగరకెళ్ళి అక్కడే వున్న మామిడిచెక్క ముక్కాలి పీట లాక్కుని కూర్చున్నాడు.

"వచ్చావా నాయనా, ఊ.... ఊ...." అంది. ఆయాసపడుతూ.

"ఏమైందమ్మా! ఎలా వుంది? బాధగా వుందా? ఏమిటో సరిగ్గా చెప్పు" అన్నాడు శాస్త్రి.

# అశక్తత

ఇంద్రగంటి జానకీబాల

"ఏం చెప్పుకోను నాయనా! ఒకటా రెండా! అన్నీ బాధలే. కడుపులో మంటగా వుంది. కాళ్ళూ చేతులూ లాగేస్తున్నాయి— విపరీతమైన నీరసం........" ఆమె ఒక్క సారి మూల్గింది.

"డాక్టరు రాలేదా"

"ఆ వచ్చాడు. రాకనే! అవి తినాలి ఇవి తినాలి అంటాడు. అవి కుదిరేవా పెట్టేవా" అంది.

మరింకేం మాట్లాడాలో తెలీక శాస్త్రి నెమ్మదిగా లేచి కాళ్ళేద్చుకుంటూ పెరట్లో కెళ్ళాడు.

* * *

సంప్రదాయ సిద్ధమైన వైదిక కుటుంబంలో పుట్టడం వల్ల అతనికి దుర్వాస శాస్త్రి అని పేరు పెట్టారు గానీ, నిజానికది అతనికేమాత్రం నప్పని పేరు.

చిన్న నాటి నుండి, సాత్వికంగా, నిశ్శబ్దంగా, నిర్లిప్తంగా పెరిగి పెద్దవాడై, తన మనస్తత్వానికి సరిపడ్డ గుమాస్తా గిరిని ఎంపిక చేసుకుని, అందులోనే స్థిరపడి పోయేడు. అతనికి వచ్చిన మాటలు మొత్తం నూరో, నూటపాతికో వుంటాయి. ఎంతో అవసరం వస్తే గానీ ఒక్కమాట పలకడు. ఎక్కువ ఊ....ఆ....లతో గడి పేస్తాడు. ఎరుగున్న వాళ్ళు అతని గురించి నోట్లో నాలుక లేదని అంటూ వుంటారు. ఎరిగీ ఎరగని వాళ్ళు నాలిముచ్చు అంటారు. ఏది ఏమైనా చిత్రమేమిటంటే కోపమంటే ఎరగని అతని పేరు మాత్రం దుర్వాస శాస్త్రి. మొదటి సారిగా అతన్ని చూసిన వాళ్ళు అతనేదో ఆపదలో వున్నాడేమో అనుకుంటారు

అతనికి తండ్రి దగ్గర నుండి వచ్చిన ఆస్తి పాస్తులేమీ లేవు. ఏదో కొంత ఇత్తడి సామాను. రెండు రాగి చెంబులు తండ్రి గుర్తుగా వుండి పోయాయి తల్లి చిన్నప్పుడే పోయింది. అయితే మంచంలో ముసలమ్మ అతని తల్లికి పినతల్లి కూతురై శాస్త్రికి తల్లి హోదాలో యింట్లో చేరింది.

శాస్త్రి నోరు లేని వాడవడం వల్ల అతని భార్య కాంతం నోరున్న మనిషిలా అనిపిస్తుంది. కానీ ఆమె నిజంగా తెలివైనదీ వ్యవహార జ్ఞానం కలదీనూ. నెల తిరిగేసరికి వచ్చే నాలుగు రాళ్ళూ తప్ప. నాలుక పీక్కున్నా పైసా పై సంపాదన లేని సంసారమది.

ముసలమ్మకి రెండెకరాల పొలం, పాత పెంకుటిల్లు వున్నాయి. ఇటూ అటూ బంధువు లెవరూ లేరు. చూసేవారూ ఓదార్చే వారూ అసలే లేరు. ముసలమ్మ ఆస్తికి సర్వహక్కుదారిణి అందుకే ఒక సుముహూర్తాన దుర్వాసుడి యింటికొచ్చి కూర్చుంది.

"నాయనా! నువ్వూ నీ పెళ్ళాం నన్ను మంచిగా చూసుకుంటే నా ఆస్తి నీపేర రాసిపోతా" నని చెప్పింది.

నిజానికి ఇలాంటివంటే శాస్త్రికి భయం, ఎందుకొచ్చిన గోల అనే చిరాకు. కాని శాస్త్రి తన అభిప్రాయం చెప్పేలోగా ఆమె ఇల్లంతా బిచ్చలి పాకినట్లు పరచుకొని, సర్వహక్కులూ సంతరించుకుంది. కోడలు పిల్ల వేడిగా ఇంత అన్నం వండి. కంచంలో పెట్టే ఏర్పాటు చేసుకుంది. శాస్త్రికి పూర్తిగా విషయం అర్థమయ్యే సరికి ఆమె ఇంట్లో మంచం మహారాణిగా స్థిరపడి పోయింది.

"ఆ ముసలి దాన్ని మనింట్లో ఎందుకు! ఎక్కడికైనా పంపేద్దాం. మనం పడలేం" అన్నాడు శాస్త్రి భార్యతో.

కాంతం భర్త వైపు సౌమ్యంగా చూసింది. గొంతులో మార్దవాన్ని నింపుకుని నెమ్మదిగా చెప్పడం మొదలు పెట్టింది.

"మనకా యిద్దరు ఆడ పిల్లలు. ఆస్తి చూడబోతే ఏమీలేదు. ఇంకా మీ నాన్నగారు పోయినప్పుడు చేసిన అప్పులో మూడొందలు మిగిలే వుంది" ఆమె ఆగి ఊపిరి తీసుకుంది.

"అంటే ఏమంటావు" అన్నాడు.

"ఏముంది అనటానికి—ఆమె ఆ

వున్న రెండెకరాలు. యిల్లూ రాస్తానంది. ఆమె మంచాన పడినా చేసేది నేనూ. నా పిల్లలు. ఫర్వాలేదు లెండి. అన్నీ చెందనాడు కుంటే ఎలాగూ మరి" అంది

అతనొక్క క్షణమాగి "ఆస్తి యిచ్చే దెంతో వచ్చేదెంతో" అన్నాడు.

"ఆ భయం లేదులెండి. నేనాకాగితాలు చూశాను" అంది. ఆమె మాటల్లోని ధీమా వల్ల ఆమె ప్లీడరు గుమాస్తాకి చురుకైన కూతురని శాస్త్రికి మరొక్కసారి గుర్తొచ్చింది।

చేయి కడుక్కుని వస్తుంటే భార్య మెడలో తళుక్కున మెరిసే బంగారు గొలుసు కనబడింది. అతనికి విషయం అర్థమైంది.

* * *

శాస్త్రి ఇంట్లో అడుగు పెడుతుంటే పక్కింటి బొజ్జ సాంబయ్య గున గున బయటకొస్తూ కనిపించాడు. శాస్త్రి స్వభావం ప్రకారం తలొంచుకుని పక్కకి



తప్పుకోబోయాడు.

"ఏమోయి -అయిందీ ఆఫీసు- వుద్యోగం" అన్నాడాయన.

"అయిందండీ" అంటూ లోపల కడుగు పెట్టేసరికి ముసలమ్మ సన్నాయి నొక్కులు నొక్కుతోంది.

"నాయనా బజారు నుంచి వస్తావు కదా। ఏ పండో ఫలమో తెచ్చి నా ముఖాన పడేయకూడదా నాయనా। నోరు చచ్చి ఏడుస్తున్నాను" అంది.

శాస్త్రికి నిజమే అనిపించింది. తనెప్పుడూ

ఆ సంగతే ఆలోచించ లేదు. ఆమె ఆస్తి నంతా తనకేయివ్వబోతుంటేతనామాత్రం చెయ్యడం ధర్మమే కదా అనుకున్నాడు. ఆక్షణం పశ్చాత్తపంతో మనసు చిన్న బోయింది.

మర్నాడుఇంటికొస్తూ పావుకిలో ద్రాక్ష పళ్ళు పట్టుకొచ్చి ముసలమ్మ చేతిలో పెట్టాడు. ఆమె ముఖం వికసించింది. అతనికి తృప్తిగా అనిపించింది.

శాస్త్రి వరుసగా ఏదో ఒకటి కొని రోజూ తేవడం మొదలు పెట్టాడు.— అయితే అతను ముసలమ్మలో చిత్రమైన అసంతృప్తిని గమనించడం మొదలు పెట్టాడు.

"ద్రాక్ష పళ్ళు తెచ్చావేం నాయనా! పులుపు. పళ్ళు లాగేశాయి.రాత్రంతా బాధ పడి పోయాను. మంచి నీళ్ళు తాగినా జివ్వున సలిపేశాయి" అని ఒక రోజు నంటే—,

"బత్తాయి పళ్ళు జలుబునాయనా!ఆవెందుకు తెచ్చావూ" అని మరోసారి అంటే,

"ఏపిల్ పళ్ళు నాకెందుకు నేనేమైనా చంటి పిల్లనా? అయినా బోలెడు ఖరీదూ" అంటూ సణిగి సాగదీసేది ఇంకొకనాడు.

శాస్త్రికి రోజు రోజుకి చిరాకు పెరిగి పోతుంది.ఈ ముసలిదాన్ని ఎలా సంతృప్తి పరచాలో తెలీడం లేదు. భార్యతో చెప్తే కాస్త ఓపిక పట్ట మంటుంది.

* * *

ఆ రోజు చిరాకుగా వుండి ఆఫీసు నుండి బాగా ముందుగా బయలుదేరి యింటి ముఖం పట్టాడు. అలవాటుగా ముసలమ్మ కోసం ఏదైనా కొందామని వెళ్ళి పాల కోవా పావుకిలో తీసుకుని బయలుదేరాడు.

ఇంటి వరండాలో అడుగు పెడుతుంటే లోపల్నించి మాటలు వినబడుతున్నాయి.

అసక్తిని చంపుకోలేక అక్కడే నిలబడి చెవులు రిక్కించాడు

"ఇదిగో అమ్మాయ్ ఏదో ఒకటి రోజూ తెస్తాడు. బాగానే వుంది. నువ్వు వాడు తెచ్చిన ప్రతీదానికీఆనందించటం మొదలు పెడితే వాడు మూడోరోజు నెత్తికెక్కి కూర్చుంటాడు. వాడేమైనా కన్న కొడుకా? ఏదో నీ డబ్బుకాశపడి నీకు చాకిరీ చేస్తున్నాడు—అదికాదని యిది—ఇది కాదని అది అడుగు. చచ్చినట్టు తెస్తాడు. పోనీ కన్న కొడుకైతే కడుపు తీపితో చేస్తాడనుకోవచ్చు. ఒక్కటే గుర్తుపెట్టుకో-తెచ్చిందేదీ బాగుందనకు ఏదోపెద్ద ముండావాడ్ని. నీమంచికే చెప్తున్నాను. "అంటూ నెమ్మదిగా—, ఆయాస పడుతూ పక్కింటి బొజ్జ సాంబయ్య ముసలమ్మకి ఉపదేశిస్తున్నాడు.

దూరంగా పెరట్లో భార్య చెంగు పరుచుకుని నిద్రపోతూ కనిపించింది

శాస్త్రికి జీవితంలో మొదటి సారిగా విపరీతమైన కోప మొచ్చింది. ముసలమ్మ రోజూ సణుగుతున్న కారణం అతనికి స్పష్టమైంది. కోపంతో బాటుగా అతని బుర్ర కూడా చురుగ్గా పని చెయ్యడం మొదలు పెట్టింది.

ఇప్పుడీ క్షణంలో సాంబయ్యతో తగాదా పెట్టుకుని ముసలమ్మ మనసు కష్ట పెట్టి, తను రసాభాసు కావడం అతనికి వివేకంగా అనిపించలేదు — ఈరోజే డాక్టరు చెప్పాడు- శిధిలమైపోయిన ముసలమ్మ మహా అయితే మూడు నెలలకంటె బతకదని.— అందుకే ఒక ఆలోచన మస్తిష్కంలో తళుక్కుమంది.

దుర్వాస శాస్త్రి శాంతంగా లోపల అడుగు పెట్టాడు.

సాంబయ్య గతుక్కు మన్నా, అనుభవజ్ఞుడు కనుక అంతలోనే సర్దుకున్నాడు.

శాస్త్రి అక్కడే స్టూలు లాక్కుని కూర్చున్నాడు. సాంబయ్య లేవబోయాడు.

"కూర్చోండి బాబయ్యగారూ" అంటూ పాలకోవా పొట్లం విప్పి ఒక బిళ్ళ ఆయన చేతిలో పెట్టాడు. ముసలమ్మకో బిళ్ళ యిచ్చాడు.


## త్వరలో

అనుభవం, జీవితం, మృత్యువు, ఏకాంతం, ప్రేమ, శీలం, దేవుడు.... భయం.... వీటి గురించి పాఠకుల్ని కదిపి కుదిపి ఊపివేసే తాత్విక నవలిక




"జ్ఞానపూరితమైన ప్రశాంత జీవితంలో అనుభవాలు మాత్రమే వున్నయ్. వాటి తాలూకు స్పృహ లేదు, జ్ఞాపకాలు లేవు, చరిత్ర లేదు."

"ఈ అవగాహనే నిజమైన స్వేచ్ఛ. ఇదే ప్రశాంతి, మోక్షం. నిర్వాణం. దైవత్వసిద్ధి!"

డాక్టర్ జి. ఆర్. కృష్ణ

ఈ అపూర్వ సత్యాన్ని తెలుగులో నవలారూపంలో ఆవిష్కరింప జేయడానికి చేసిన తొలి ప్రయత్నం ఈ "గతి"

"గతి" చదవడం ఒక తాత్వికానుభవం!

"నువ్వు నిజంగా అదృష్టవంతురాలివమ్మా. కన్న కొడుకులు కూడా యిలా చెయ్యరు" అంటూ కొంత సేపు భజన చేశాడు సాంబయ్య. అతను మాట్లాడినంత సేపూ శాస్త్రి వంటికి కారం రాసినట్లు బాధపడ్డాడు. అయినా పెదవి విప్పలేదు.

'ముసలి వెధవా! నీ బుద్ధి నాకు తెలుసు లేరా. నీ నోరెలా మూయించాలో నాకు బాగా తెలుసురా' అని మనసులో కసితీరా తిట్టుకున్నాడు.

ముసలమ్మ "జిహ్వ లేచొచ్చింది రా. నాయనా" అంటూ తింది.

ఆనాటి నుండి ముసలమ్మకేం తెచ్చినా అందులో కొంత భాగం సాంబయ్యకి యిచ్చేసరికి అతనికి నోరు మూత పడింది. ముసలమ్మ ఆమె సహజ ధోరణిలో ఆనందంగా వుంటోంది.

అయితే రోజురోజుకీ శాస్త్రిలో కోపం, కసి, ద్వేషం రగిలి, అతనిలో శాంతిని హరిస్తున్నాయి. సాంబయ్యకి రోజూ ఏదో ఒకటి లంచం పెట్టి అతని నోరు మూయిస్తూ—, మనసులో అతన్ని శాపనార్థాలు పెట్టుకునే వాడు.

సాంబయ్యని అల్లరి పాలు చెయ్యాలని కసితో ముసలమ్మ మరణం కోసం ఆత్రుతగా ఎదురు చూడటం మొదలు పెట్టాడు శాస్త్రి.

*        *        *

ఆ రోజు రానే వచ్చింది. ఒక రాత్రంతా బాధపడి ముసలమ్మ కన్ను మూసింది. ఆస్తి శాస్త్రికి వచ్చేలా అన్ని ఏర్పాట్లూ అంతక్రితమే చేసేసింది.

పోతుందని తెలిసినా, ఎదురుచూసినా నిజంగా కట్టెగామారిపోయిన ముసలమ్మని చూసి శాస్త్రి ఘొల్లుమన్నాడు.

అన్ని ఏర్పాట్లు లోటు లేకుండా చేయించాడు. కాస్త స్థిమిత పడ్డాక సాంబయ్య విషయం గుర్తుకొచ్చింది. ఇప్పుడే బాగుండదు. మరి నాలుగురోజులు పోనీ అని సరి పెట్టుకున్నాడు.

పన్నెండు రోజులూ అయిపోయాయి. తను సాంబయ్యకి బుద్ధి చెప్పడంలో జాప్యం చేస్తున్నానని శాస్త్రికి పదే పదే అనిపించ సాగింది. అయితే వెంటనే నడుం కట్టి సాంబయ్య ఇంటి మీదకెళ్ళి, విషయం చెప్పి, నాలుగూ దులిపి, గడ్డి పెట్టి రావడానికి తగినంత ఊపురావడం లేదు. అయినా అతనా విషయం వదిలేయ దల్చుకోలేదు. తను పరోక్షంగా సాంబయ్య వల్ల పడిన వేదన అతని మనసులోంచి తొలగిపోలేదు

అందుకే కూడదీసుకున్న కోపంతో, కల్పించుకున్న కసితో, ఎంతో ఘాటుగా చెప్పాలనుకున్నవి, ఎంత వరకు చెప్పగలనా అనే సంశయంతో అతనా రోజు బయలు దేరాడు.

తనని మానసికంగా కృంగదీసి బాధించిన సాంబయ్యని క్షమించకూడదనుకున్నాడు. వాళ్ళ యిద్దరబ్బాయిలతో చెప్పి బుద్ధిచెప్పించాలనుకున్నాడు. ఇంకా ఎన్నో అనుకున్నాడు.

ఆ ఇంటి ముంగిటికి వెళ్ళి గేటు తీసేసరికి అతనిలో ఏ ఉద్వేగమూ లేకుండా పోయింది. విషయం ఎలా మొదలు పెట్టాలా అనే తడబాటు కూడా అతనికి కలిగింది. అగ్ని ప్రమాదంలో కాలి మసైపోయిన కొంపలా వుంది అతని మనసు.

అడుగులో అడుగు వేస్తూ లోపలికెళ్ళి సంశయంగా వరండాలో నిలబడ్డాడు.


ఒకే బిళ్ళ నొప్పిని మాయం చేసే



స్టాపేక్




తలనొప్పి, ఒళ్ళునొప్పి,
ఫ్లూ మరియు
పళ్ళ నొప్పులను
తృటిలో మాయం చేసే
ఉపశమనం కలిగించే
ఏకైక ఫార్ములా
ఒక్కమాత్ర

Adept-M/PP/101/84

"ఒరేయ్. మీరు కన్న కొడుకులు కారురా. రాక్షసులు. ఏం? నేనేం తక్కువ ఆస్తి యిస్తున్నానని నా మాట పట్టించుకోరు. నా బాగు చూడరు? మూడు నాళ్ళుగా మంచాన పడితే కనీసం డాక్టర్ని పిలవమంటే పిలవరు. ఆ దుర్వాస శాస్త్రి ఆ ముసలమ్మకి కన్న కొడుకు కూడా చేయనంత చాకిరీ చేశాడు. ఎంత ప్రేమగా చూసేవాడు. రోజూ పదినిముషాలు ఆమెతో మాట్లాడితే గాని వెళ్ళే వాడు కాదు. ఆమె కేది తెచ్చినా ఎంతో ప్రేమగా "బాబయ్యగారూ తినండి" అనేవాడు. ఎందుకురా వెధవ పిల్లలు? కంటేనేనా పిల్లలు? ఆ ముసలమ్మ వాడ్ని నవమాసాలూ మోసి కనలేదే—మంచితనం మనిషిలో వుండాలిరా" సాంబయ్య గొంతు శ్లేష్మంతో గరగర మంది.

శాస్త్రి నిలువునా నీరై పోయాడు. అతననుకున్నదొకటి జరిగిందొకటి.

ఎన్నో మాటలతో సాంబయ్యని పొడవాలని వచ్చిన శాస్త్రి బలహీనుడై పోయాడు. తన గురించి ఇలా అనుకునే సాంబయ్యని ఇప్పుడు కొడుకుల ముందు తనే మనగలడు?

శాస్త్రి వెనక్కి తిరిగాడు.

"ఎవరు కావాలండీ" అన్న చిన్న పిల్ల మాటలకి.

చేసేది లేక "సాంబయ్య.... గారు" అన్నాడు.

"తాతయ్య లోపలున్నాడు" అందా పిల్ల.

లోపలికి అడుగు పెట్టాడు.

"ఏం నాయనా రా. రా లోపలికి. ఇలా కూర్చో. నా అవస్థ చూశావా ఎలావుందో" అంటున్న సాంబయ్య కళ్ళల్లో నీటి పొర కమ్మింది.

"ఏం లేదు. మీరు కనిపించకపోతే, వంట్లో బాగోలేదోమోననీ...." మరింక మాట్లాడలేక పోయాడు శాస్త్రి.

"నీ కెప్పుడూ అభిమానమే నాయనా! ముసలమ్మ అదృష్ట వంతురాలు. నీలాంటి కొడుకు దొరకటం పూర్వజన్మ సుకృతం! కడుపార కంటేనే పిల్లలా" ఆయనింకా మాట్లాడుతూనేవున్నాడు. ఆయాసపడుతూ మధ్యలో ఆగుతూ. శాస్త్రికి ఏమీ వినిపించటంలేదు. మనసు మొద్దుబారి వుంది.

కాస్సేపు కూర్చుని లేచి ఇంటి ముఖం పట్టాడు. శత్రువుల్ని కాల్చి పారేద్దామని వెళ్ళిన సైనికుడు శత్రువుని ఓదార్చి, గాయాలకు కట్లు కట్టి తిరిగి వచ్చినట్లు శాస్త్రి ఇల్లుచేరి ఉస్సూరంటూ కుర్చీలో వాలి పోయాడు. ●



దీపావళి వెలుగు చూపి
తిరుగులేని ప్రేమ చూపి
శాంత్యస్త్రము సంధించక
సమరసాప్తి వొకేసారి
రారెరారె యువకులార!
రారెరారె యువతులార!!

చిత్రం: మారేమండ శ్రీనివాసరావు